దానంను భారీ మెజార్టీతో గెలిపిస్తాం

నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



శ్రీరాంనగర్ బస్తీలో ప్రచారం చేస్తున్న మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి తీరుతామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె బంజారాహిల్స్‌లోని సింగాడికుంట, ఉదయ్‌నగర్, అంబేద్కర్‌నగర్, శ్రీరాంనగర్, ఎస్పీనగర్ బస్తీల్లో ఇంటింటి ప్రచారం చేస్తూ దానం నాగేందర్‌ను గెలిపించాలంటూ ఓటర్లను కోరారు. ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ కాలంలోనే పేదల మనసు గెలుచుకున్నదని అందువల్ల ప్రతీ ఒక్కరు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడలో కిషన్‌రెడ్డి ప్రచారం



కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలోకి చేరుతున్న యువకులు

వెంగళరావునగర్: భారత కీర్తి ప్రతిష్టలు మరింత ఇనుమడింపజేసి ప్రపంచానికి దేశ ఖ్యాతిని చాటేందుకు ప్రధాని నరేంద్రమోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారని, ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి సికింద్రాబాద్ ఎంపీగా తనను గెలిపించాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. యూసుఫ్‌గూడలో జరిగిన రోడ్ షో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ క్రమంలో యూసుఫ్‌గూడ డివిజన్‌కు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయన వారికి తమ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ జాతీయ మహిళామోర్చా సభ్యురాలు డాక్టర్ పద్మ వీరపనేని, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షురాలు కీర్తిరెడ్డి, లంకెల దీపక్‌రెడ్డి, సందీప్‌యాదవ్, కిలారి మనోహర్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరినగర్‌లో బీఆర్‌ఎస్ ప్రచారం

వెంగళరావునగర్: గడచిన పదేళ్ల కాలంలో సీఎం కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ కోరారు. యాదగిరినగర్‌లో గురువారం ఆమె ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు విజయ్‌కుమార్, శ్యాంరావు ముదిరాజ్, ఆంజనేయులు యాదవ్, పూజారి బాల్‌రాజ్, కిట్టు, అఫ్సర్, బాలు, పవన్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఐసీఎస్‌ఈ ఫలితాల్లో సత్తాచాటిన కల్ప స్కూల్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన కల్ప స్కూల్ విద్యార్థులు ఐసీఎస్‌ఈ పదవ తరగతి 2023–24 పరీక్షల్లో సత్తాచాటుకున్నారు. పరీక్షలకు హాజరైన 57 మంది విద్యార్థుల్లో 19 మంది 90 శాతం కన్నా ఎక్కువ స్కోరు సాధించడంతో పాటు 49 మంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారని యాజమాన్యం తెలిపింది. స్కూల్ విద్యార్థిని మహేక్ గుప్తా 500 మార్కులకు 496 మార్కులతో (99.2 శాతం) అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఆమె కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 100 మార్కులు, మిగతా 4 సబ్జెక్టులలో 99 మార్కులు సాధించి విజేతగా నిలిచిందని యాజమాన్యం తెలిపింది. తర్వాతి స్థానాల్లో 492 మార్కులతో ఎస్.స్వర, చైత్రవెంకట నాగ సాయిలు ఉన్నారు. ఈ ఇద్దరూ హిస్టరీ, సివిక్స్, జియోగ్రఫీ, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 100 మార్కులు సాధించారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి



ప్రచారంలో పాల్గొన్న నవీన్‌యాదవ్

శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు రాష్ట్రంలో అధికారంలోకి తీసుకువచ్చారని, కేంద్రంలో మన సత్తా మరితంగా వినబడాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత నవీన్‌యాదవ్ అన్నారు. గురువారం షేక్‌పేట డివిజన్‌లోని పలుబస్తీల్లో పాదయాత్ర నిర్వహించి సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా ప్రచారాన్ని నిర్వహించారు. ఆరు గ్యారంటీల అమలును నమ్మి హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. నేతలు గౌంటి సాయినాథ్‌యాదవ్, విక్రమ్‌యాదవ్, డివిజన్ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

మా అభివృద్ధే గెలిపిస్తుంది: కవితారెడ్డి



వెంకటేశ్వరకాలనీ: మేం చేసిన అభివృద్ధి పనులే మమ్మల్ని గెలిపిస్తాయని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్‌లో సికింద్రాబాద్ పార్లమెంటు సభ్యుడు పద్మారావుగౌడ్‌ను గెలిపించాలంటూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్తీలు, కాలనీల్లో ఎక్కడికి వెళ్ళినా బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు చెబుతున్నారని ఈ ఎన్నికల్లో పద్మారావుగౌడ్ బంపర్‌మెజార్టీతో గెలవడం ఖాయమని అన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



రహమత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, మహిళలు కాంగ్రెస్ పార్టీలో స్వచ్ఛందంగా చేరుతుండటం అభినందనీయమని బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ అన్నారు. బోరబండ డివిజన్‌లోని వివిధ బస్తీలకు చెందిన బీఆర్‌ఎస్ బతుకమ్మ కమిటీ ప్రతినిధులు, నాయకులు బుధవారం రాత్రి బాబా ఫసియుద్దీన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బాబా మాట్లాడుతూ... సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త, నాయకులు శ్రమించాలని సూచించారు. నేతలు మల్లేశ్, చెన్నయ్య, సత్యనారాయణ రాముగౌడ్, లక్ష్మణ్, సరళ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చీమ చిటుక్కుమన్నా.. పోలీసులొచ్చేస్తారు..!

- పోలింగ్ రోజున ఐదంచెల భద్రతా వ్యవస్థ
- ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ
- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో రెండు వేల మంది పోలీసులు
- అడుగడుగునా పోలీస్ పికెట్‌లు
- అనుమానితుల కదలికలపై నిఘా
- రోజూ రౌడీషీటర్ల తనిఖీలు
- ఠాణాలకు చేరుకున్న సాయుధ బలగాలు



ఫిలింనగర్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

బంజారాహిల్స్: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ బూత్‌ల వద్ద ఐదంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతపై ఇప్పటికే ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధి కిందికి జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మధురానగర్, పంజగుట్ట, బోరబండ పోలీస్ స్టేషన్ల పరిధిలో 329 పోలింగ్ బూత్‌లు ఉండగా ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, ఖైరతాబాద్, పంజాగుట్ట, లేక్ పోలీస్ స్టేషన్, సెక్రటేరియట్, నారాయణగూడ, దోమలగూడ, అబిడ్స్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 245 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

అదనపు బలగాలు.. భారీ బందోబస్తు...

ఎన్నికల విధులకు అదనపు బలగాలు వచ్చాయి. వీటితో సీఏఎస్‌ఎఫ్ బలగాలు బందోబస్తును పర్యవేక్షిస్తాయి. సాధారణ పోలింగ్ కేంద్రంలో ఇద్దరు, పోలింగ్ లొకేషన్ వద్ద ఇద్దరు, సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు బలగాలతో భద్రత ఏర్పాటుచేస్తున్నారు. ప్రతి ఠాణాకు ఒక క్యూఆర్‌టీ (క్విక్ రెస్పాన్స్ టీమ్) సైతం ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు ఈ రెండు నియోజకవర్గాల ఈవీఎంలను భద్రపరిచిన కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అన్ని మార్గాల్లో మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఏసీపీ నేతృత్వంలో డివిజన్ స్థాయిలో నిఘా బృందాలు పనిచేయనున్నాయి.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ఫిలింనగర్: మరో నాలుగు రోజుల్లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికారులతో పాటు వివిధ విభాగాల అధికారులు ఎక్కడికక్కడ తనిఖీలు ముమ్మరం చేశారు. అందులో భాగంగా గురువారం ఫిలింనగర్ పోలీసులు పలు ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లో అనుమానిత వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల్లో ధన, లిక్కర్ ప్రవాహం లేకుండా పోలీసులు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు.

బందోబస్తు ఎలా ఉంటుందంటే...

- ప్రతి పోలింగ్ బూత్ గేటు వద్ద ఒక పోలీసు విధుల్లో ఉంటారు.
- పోలింగ్ లొకేషన్ గేటు వద్ద ఇద్దరు పోలీసులు ఉంటారు.
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రం వద్ద ముగ్గురు సాయుధ పోలీసులు ఉంటారు.
- పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపు ఇద్దరు పోలీసులు ఉంటారు.
- ఇంపార్టెంట్ జంక్షన్‌లలో పికెట్లు ఏర్పాటు చేస్తారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 16 పికెట్లు ఏర్పాటుచేశారు..
- రెండు నియోజకవర్గాల్లో 76 రూట్ మొబైల్స్ ఏర్పాటు చేశారు.
- ప్రతి ఇన్‌స్పెక్టర్ మొబైల్ టీమ్ పనిచేస్తుంది.
- డీఐ మొబైల్ టీమ్ పనిచేస్తుంది.
- ప్రతి ఏసీపీకి మొబైల్ టీమ్ పనిచేస్తుంది.
- ప్రతి పోలీస్ స్టేషన్‌కు రెండు ఇంటర్‌సెప్టార్ వెహికల్స్ కేటాయించారు.
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ఎనిమిది ట్రాఫిక్ చెకింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు.
- రెండు నియోజకవర్గాలు కలిపి రెండు వేల మంది పోలీసులు విధులు నిర్వహిస్తారు.
- ప్రతి పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో మూడు పెట్రోలింగ్ కార్లు విధులు నిర్వహిస్తాయి.
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో 16 బ్లూకోల్ట్స్ టీమ్‌లు పనిచేస్తాయి.
- రూట్ మొబైల్స్ 30 ఏర్పాటు చేశారు.
- స్ట్రాంగ్‌రూమ్‌లు ఉన్న స్టేడియం చుట్టూ మూడంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఇక్కడ సాయుధ బలగాలు మోహరించాయి.

ప్రజల గొంతుకను గెలిపించండి



ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

ఫిలింనగర్: ప్రజల గొంతుక, బడుగు బలహీన వర్గాలకు నిత్యం అందుబాటులో ఉండే సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ కోరారు. గురువారం ఆయన ఫిలింనగర్‌లోని జ్ఞానిజైల్‌సింగ్‌నగర్, దుర్గా భవానీనగర్, దీన్‌దయాల్‌నగర్, స్వామి వివేకానందనగర్ బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గతంలో ఒక్కక్షణం కూడా కరెంటు పోయేది కాదని, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో అన్నీ సమస్యలేనని అన్నారు. నేతలు మారెమ్మ, అశోక్, జ్యోతి, నడిమింటి కృష్ణ పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి..

బంజారాహిల్స్: బాలికపై లైంగిక దాడికి పాల్పడడమే కాకుండా సంబంధిత ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానంటూ బెదిరింపులకు పాల్పడిన ఓ బాలుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జూబ్లీహిల్స్ ఎస్ఐ గోవర్ధన్‌రెడ్డి సమాచారం మేరకు... సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలోని రామచంద్రాపురం ప్రాంతానికి చెందిన ఓ బాలుడు(17) యూసుఫ్‌గూడ ప్రాంతంలో నివసిస్తూ ఇక్కడే చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో పాఠశాలలోని సీనియర్ ద్వారా అతనికి యూసుఫ్‌గూడ సమీప ప్రాంతంలో నివసించే పదో తరగతి చదువుతున్న ఓ బాలిక(14) పరిచయమైంది. ఆ బాలికతో స్నేహం చేసిన అతను రెండేళ్ల క్రితం బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో అసభ్యకరంగా ప్రవర్తించాడు. తాజాగా మార్చి 26న సైతం ఇలాగే బాలిక ఇంట్లోకి వెళ్లి ఆమెపై లైంగికంగా దాడికి పాల్పడ్డాడు. డబ్బులు కావాలంటూ బెదిరించాడు. ఈ విషయాన్ని బయటకు చెబితే తన వద్ద ఉన్న ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానంటూ బెదిరింపులకు దిగాడు. ఈ క్రమంలో ఇంట్లో భయపడుతున్న కుమార్తెను ఆరా తీయగా విషయం బయటపడింది. దీంతో తల్లిదండ్రులు బాలుడిపై జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు బాలుడిపై కేసు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడిని జువైనల్ హోంకు తరలించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసు ఛేదించిన పోలీసులు

మృతుడు రౌడీషీటర్‌గా గుర్తింపు

బంజారాహిల్స్: యూసుఫ్‌గూడ మెట్రోస్టేషన్ కింద జరిగిన గుర్తుతెలియని వ్యక్తి మృతి కేసు మిస్టరీ వీడింది. మృతుడు గాంధీనగర్ ఠాణా పరిధిలో రౌడీషీటర్‌గా గుర్తించారు. వివరాలివీ... యూసుఫ్‌గూడ మెట్రో స్టేషన్ కింద ఈ నెల 6న అర్ధరాత్రి మెట్రోపిల్లర్ నెంబర్ 1525 వద్ద ఉన్న మెట్రోస్టేషన్ వద్ద ఓ వ్యక్తి రక్తపు మడుగులో పడి ఉన్నాడని డయల్ 100 ద్వారా జూబ్లీహిల్స్ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు రంగంలోకి దిగి గుర్తుతెలియని వ్యక్తి హత్య జరిగినట్లు కేసు నమోదు చేశారు. అదనపు ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఎస్ఐ శ్రీరాంగోపీలు తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలం చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లోని అన్ని సీసీ కెమెరాలను పరిశీలించారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసి లుక్‌అవుట్ నోటీసుతో చుట్టుపక్కల అన్ని ప్రాంతాల్లో విచారించారు. మృతుడి వేలిముద్రలను సేకరించిన పోలీసులు వేలిముద్రలను ఫోరెన్సిక్ విభాగానికి పంపగా గాంధీనగర్ ఠాణా పరిధిలో రౌడీషీటర్‌గా ఉన్న ఎర్రవెల్లి రాహుల్ (30)గా గుర్తించారు. భోలక్‌పూర్ ప్రాంతానికి చెందిన రాహుల్ గత ఆరు నెలలుగా యూసుఫ్‌గూడ మెట్రోస్టేషన్ ప్రాంతంలో ఉంటూ సినీ పరిశ్రమలో పనిచేసే కార్మికులను బెదిరిస్తూ మద్యానికి డబ్బులు లాక్కొని జీవిస్తున్నట్లు గుర్తించారు. సినీ పరిశ్రమలో సెట్టింగ్ విభాగంలో కార్మికులుగా పనిచేస్తున్న నారాయణపేట జిల్లా కోస్గి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కోరింధ్ల సతీష్ (39), సంగారెడ్డి జిల్లా సదాశివపేట ప్రాంతానికి చెందిన మల్లాపురం రమేష్ (25)లను మూడు నెలల క్రితం ఇలాగే శ్రీనగర్‌కాలనీ ప్రాంతంలో బెదిరించి దాడి చేసి వారి వద్ద నుంచి డబ్బులు లాక్కొన్నాడు. గతంలోనూ ఇలాగే కొట్టి డబ్బులు లాక్కోవడంతో సతీష్..రాహుల్‌పై కోపాన్ని పెంచుకున్నాడు. ఈ నెల 6న రాత్రి మద్యం సేవించిన సతీష్, తన స్నేహితుడైన రమేష్‌కు మద్యాన్ని కొనిచ్చి రాహుల్‌పై దాడి చేయడానికి రావాలని చెప్పాడు. ఇలా ఇద్దరూ కలిసి 6వ తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత దాదాపు 1.45 గంటల ప్రాంతంలో మెట్రో స్టేషన్ కింద ఉన్న రాహుల్‌ను కర్రలతో తలపై తీవ్రంగా కొట్టడంతో రక్తస్రావమైంది. అతని మర్మాంగాలపై, నేత్రాలపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం వారిద్దరూ అక్కడి నుంచి వెళ్లిపోయి రోజులాగే అదే ప్రాంతంలో తిరుగుతుండగా గుర్తించిన పోలీసులు వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు అదుపులో ఉన్నారని, విచారిస్తున్నామని జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపారు.

గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ఫెయిల్: పద్మారావుగౌడ్



ప్రేమ్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న పద్మారావుగౌడ్

బంజారాహిల్స్: మోసపూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. అధికారంలోకి వచ్చిన అతి తక్కువ రోజుల్లోనే దాని నిజస్వరూపం ప్రజలు తెలుసుకున్నారని వారికి ప్రజలే ఈ ఎన్నికల్లో సరైన గుణపాఠం చెబుతారని సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ అన్నారు. బంజారాహిల్స్‌లోని ప్రేమ్‌నగర్, ఖాజానగర్, భోలానగర్, ఎన్బీటీనగర్, ఎన్బీటీ నగర్ బస్తీల్లో ఆయన తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ మాజీ కార్పొరేషన్, బంజారాహిల్స్ డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జి విప్లవ్‌కుమార్, సీనియర్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ... ఉచిత బస్సు సౌకర్యం అని పెట్టి బస్సుల సంఖ్యను అమాంతం తగ్గించారని దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏ ఒక్క పథకం కూడా సమర్థవంతంగా అమలు కావడం లేదని విమర్శించారు. ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. స్థానిక నేతలు రావుల విజయ్‌కుమార్, రాజేశ్వరి, జేజోళ్ల రాజు, లత, పద్మ, రాజేశ్వరి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దానంతోనే సంక్షేమం: మామిడి నర్సింగ్‌రావు



ప్రచారం నిర్వహిస్తున్న నర్సింగ్‌రావు

ఫిలింనగర్: బడుగు, బలహీన వర్గాలకు నిత్యం అందుబాటులో ఉండే దానం నాగేందర్ కావాలో, బస్తీలంటేనే పట్టని ఇతర నేతలు కావాలో మీరే తేల్చుకోవాలంటూ సీనియర్ కాంగ్రెస్ నేత మామిడి నర్సింగ్‌రావు అన్నారు. గురువారం ఆయన సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా ఫిలింనగర్‌లోని పద్మాలయ అంబేద్కర్‌నగర్ బస్తీలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల మనిషిగా, మాస్ లీడర్‌గా ఎదిగిన దానం నాగేందర్‌ను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. స్థానిక నేతలు సుధాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, తిరుపతి, సురేందర్, నాగమణి పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో 784 మంది ఉద్యోగులు ఓటేశారు..



ఓటు వేస్తున్న కాప్రా తహసీల్దార్ సుచరిత

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ముమ్మరంగా జరుగుతోంది. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు ఈ నెల 8న ఆఖరు కాగా, ఇంకా కొంతమంది వినియోగించుకోవాల్సి ఉండటంతో 10వ తేదీ వరకు పొడిగించారు. ఈ నెల 10న కూడా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకోవచ్చని ఖైరతాబాద్ అసెంబ్లీ ఎన్నికల నోడల్ అధికారి అనితారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 1213 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు గాను గురువారం నాటికి 784 మంది ఓటు వేశారన్నారు. ఇంకో 429 మంది ఓటు వేయాల్సి ఉందని, వీరంతా శుక్రవారం వేయడానికి అవకాశం ఉందన్నారు.

అదనపు కట్నం తేకుంటే చంపేస్తానంటూ బెదిరింపు

వెంగళరావునగర్: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ ఓ మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల సమాచారం మేరకు... కార్మికనగర్‌లో నివాసం ఉండే శాంత, వడ్డె రవికుమార్ దంపతులకు 2022లో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రవికుమార్‌కు రూ. 5 లక్షల కట్నం, ఐదున్నర తులాల బంగారం, లక్ష వరకు ఇంటి సామన్లు శాంత తల్లిదండ్రులు ఇచ్చారు. వారికి పిల్లలు లేరు. ఇటీవల అదనపు కట్నం కోసం భర్తతోపాటు అత్త, మామ, ఆడపడుచులు, భర్త స్నేహితులు సైతం దూషిస్తూ శాతను కొడుతూ వేధిస్తున్నారు. ఆడబిడ్డలు కూడా తన డ్రెస్ మార్చుకుంటే ఫొటోలు తీసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. విడాకులు ఇవ్వాలని, రూ. 50 లక్షలు కట్నం, రెండెకరాలు భూమి ఇచ్చే వేరే అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని లేదంటే చంపేస్తానంటూ భర్త ఇతర కుటుంబ సభ్యులు బెదిరిస్తున్నారు. తనకు వారి నుంచి ప్రాణహాని ఉందని తనను రక్షించాలని కోరుతూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.